# సర్పంచ్ గారి పిల్లి

పెళ్లివారికన్నా పెట్టెలు మోసే వాళ్ల హడావిడి ఎక్కువన్నట్టు - ఈ టైపు మనుషులు ఈ మధ్య బాగా తయారయ్యారు. వీళ్లెప్పుడూ దినపత్రికలు తిరగేసినా అవిశ్వాస తీర్మానాలు పెట్టారా, మధ్యంతర ఎన్నికలు వస్తాయా? అనే వార్తలకోసమే కళ్లల్లో క్యాండిల్లేసుకొని చూస్తుంటారు.

ఎందుకంటే వీళ్లకి ఎలక్షన్లొస్తే... పెద్ద పండగ! మూడు నాలు గు నెలలు... తా.తి.తి.గా అంటే తాగటం, తినటం, తిరగటంలో బిజీ బిజీ అన్నమాట.

పొరుగు దేశంలో ఎలక్షన్లొచ్చినా... ఆ గాలి వీళ్లకి తగిలి ఉబ్బితబ్బిబ్బయిపోయి... 'అయ్యయ్యో మనకెప్పుడొస్తాయో'నని బెంగెట్టుకొని మనకి ఎలక్షన్లొచ్చేంత వరకూ మంచమెక్కేటైపు...

అలాంటి బాపతే సుందరయ్యా, పరంధాములు!

అసెంబ్లీ ఎన్నికలైపోయేసరికి... దిగులుతో మంచమెక్కారు... లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్ని కలిపి పెట్టినందుకు ఎలక్షన్ కమీషన్‌కు శాపనార్థాలు పెట్టి పెట్టి... మళ్లీ అవిశ్వాసం రాకుండా భారీ మెజార్టీ ఇచ్చినందుకు జనాల్ని సైతం తిట్టి తిట్టి... కనుచూపు మేరలో ఎన్నికలు కనపడనందున కోమాలోకి వెళ్లిపోయి మంచమెక్కారు.

ఓ ఆస్పత్రిలో ఇద్దర్నీ పక్కపక్కనే ఉంచి... ముకుల్లో గొట్టాలు జొప్పించి అన్నపానీయాలు పంపిస్తూనే ఉన్నారు. రోజులో రెండు, మూడుసార్లు 'జిందాబాద్' అనో, 'దేశ్ కీ నేత' అనో పలవరిస్తుండటంతో బతికే చచ్చారన్న భరోసాతో ముక్కుల్లోంచి గొట్టాలు తీయట్లేదు.

అప్పటికే నెల్రోజులు గడిచాయి. అందరికీ విసుగొచ్చింది... కనీసం సదరు ఎమ్మెల్యేని, ఎంపీని పిలిపిస్తేనైనా లేచికూచుంటారేమోనని... ఆ పనీ చేశారు.

వాళ్లకి కావల్సింది ఎలక్షన్లుగాని... ఎమ్మెల్యేలు, ఎంపీలు అక్కర్లేదన్నట్టు కుంభకర్ణుడిలాగా లేవలేకపోయారు.

దాంతో బంధుమిత్రులకీ, డాక్టర్లకీ చిరాకేసింది. ముక్కుల్లో గొట్టాలు పీకేయడానికి... తిథి, నక్షత్రాలు చూసి ఓ ముహూర్తం పెట్టారు! కాని ఆ ముహూర్తానికి ముందే... ఆ గదిలోకి వచ్చిన ఓ నర్స్... బెడ్‌మీద పడేసి ఉన్న ఆ రోజు పేపర్‌తీసి 'స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి - మంత్రిగారి పిలుపు' అని కాస్త గట్టిగా చదివింది.

అంతే! గబ్బర్‌సింగ్, ఎస్వీరంగారావు లెవల్లో వికటాట్టహాసాలు చేస్తూ లేచి కూచున్నారు సుందరయ్య, పరంధాములు అదృశ్యం చూసి... నర్స్ భయంతో పరుగులు పెట్టింది.

ఇద్దరూ... ప్రమాణస్వీకార పత్రాన్ని ప్రాణంలా చదువుకున్న మంత్రిగారిలా... ఆ న్యూస్‌పేపర్ని ప్రేమగా చదివి పులకించిపోయారు. గొట్టాలు పీకేసుకొని... గట్టిగా శ్వాసపీల్చి వదిలారు. ఆర్తిగా కౌగిలించుకున్నారు. హాస్పిటల్ బయటికి రాగానే "నువ్వో గ్రూపు... నేనో గ్రూపు పద మనూరికి మరో మూణ్ణాల్లుగెల్లు జల్సా చేద్దాం..." అనుకొని బయలుదేరారు.

* * * *

"ఈసారి మీరు తప్పకుండా సర్పంచ్‌గా పోటీ చేయాల్సిందే..." అప్పటికే ఫుల్‌బాటిల్ లాగించిన పరంధాములు భూషణంతో అన్నాడు.

"ఒరేయ్ పరంధాములూ! గెలుస్తానంటావా? అయినా ఇప్పుడు సర్పంచ్‌గా ఉన్న రాజారాంకు, నాకు శత్రుత్వం అని నీకూ తెలుసు... వాడితో పోటీపడి గెలుస్తానంటావా?" అన్నాడు పెగ్గుపోస్తూ.

"ఈ ఎలక్షన్లో ఆడిబతుకు రేడియోలా కనపడకుండా పోవాలండీ... మీరు కలర్ టీవీలా వెలిగిపోవాలండీ... అందుకోసం మీరు ఇప్పట్నించే పాకిస్థానోడి పాలసీలా రాజారాం మీద ఎక్కడపడితే అక్కడ దుమ్మెత్తిపోయడానికి సిద్ధంగా ఉండాలండీ..." అని హింటిచ్చాడు పరంధాములు.

"అదెలారా...?" అడిగాడు భూషణం.

"తెలుగోడి బుర్ర తేలుకొండితో సమానమని మీకు తెలీదు. ఎలక్షన్ల డేటు వచ్చేనాటికి... రాజారాముకి... సరైన ప్రత్యర్థి భూషణంగారే అని జనాలకి అర్థమయ్యేలా 'సీన్'లు పెంచాలండీ..."

అవున్రా... దాంతో మన గ్రూపులో ఉండైవాడెవడో, ఉండని గాడిదకొడుకులెవరో తెలిపోద్ది. ఆ సీన్‌లేవో నువ్వే పెంచెయ్." అన్నాడు భూషణం వెయ్యిరూపాయల్ని తీసి పరంధాములు జేబులో కుక్కుతూ...

"అదెంతసేపండీ... చిటికెలోపని... ఉస్కో..." అన్నాడు పక్కనే పడుకున్న కుక్కనుద్దేశించి.

'ఉస్కో' అనగానే చొంగకారుస్తున్న కుక్క ఒక్క ఉదుటున లేచి... వాకిట్లోంచి స్కూలుకెళ్తోన్న ఓ అబ్బాయి కాలిని గట్టిగా కరిచింది.

ఆ కుర్రాడు కుయ్యో...మొర్రో అంటూ ఇంటికి పరిగెత్తాడు.

"అదెంట్రా... కుక్కని రెచ్చగొట్టావ్" అనుమానంగా అడిగాడు భూషణం.

"పాలిట్రిక్స్ అంటే అంతే మరి... మీరింకా చాలా నేర్చుకోవాలి" అని ఘంటసాలలా గొంతు సవరించుకొని... భగవద్గీత లెవల్లో చెప్పాడు పరంధాములు.

"ఓటు అనేది... ఎల్లవేళలా గుండెలమీద గునపంపోటులా గుచ్చుతూనే ఉండాలి. అలాంటివాడికే జనం నాడీ, బాడీ రెండూ గోచరిస్తాయి. తేదీ ప్రకటించిన రోజే ఎలక్షన్లలో నిలబడాలనుకునేవాడికి డిపాజిట్టూ దక్కదు. పదవి కోసం పాపాత్ముల్ని చేరదీసైనా... పావుల్ని కదపటం ప్రథమ లక్షణం... ముందు పాముల్లా బుసకొడ్తూనే... వెనక గోవుల్లా కలిసి వుండటం రాజకీయ ఆంతర్యం. ఈ థియరీని అర్థంచేసుకున్న వాడికెప్పుడూ మెజార్టీ... ప్రజార్టీ... ప్రియార్టీ మూడూ దక్కుతాయి"

భూషణం భక్తిపారవశ్యంతో పరంధాములుకి నమస్కరించాడు.

* * * *

"సుందరయ్యా... సమయానికి డాక్టర్‌ని తీసుకొచ్చి... నాబిడ్డని కాపాడావ్. వాడి నాభి చుట్టూ ఇంజక్షన్లు పడటమే బాధగా ఉంది సుందరయ్యా" అన్నాడు సర్పంచ్ రాజారాం.

"నాకైతే గుండే మండుతోందయ్యా... కుక్క కరిచినందుకు. ఆ కుక్క మనబ్బాయినే ఎందుకు కరవాలి?" అన్నాడు వీరావేశంతో.

"అదేంట్రా... కుక్కలకి వీడు సర్పంచ్ కొడుకు, వాడు వార్డు మెంబర్ కొడుకు అని తెలుస్తుందా ఏంటీ?" అన్నాడు నవ్వుతూ.

"కరిచిన కుక్క ఎవరిదో తెలిస్తే... మీకూ నిద్రపట్టదు" అన్నాడు పళ్లు నూరుతూ.

"ఎవరిదిరా?"

"అది భూషణం కుక్క"

ఆ మాట వినగానే రాజారాం గుండె కాలిపోతున్న ట్రాన్స్‌ఫారంలా భగ్గున మండింది.

"అప్పట్నించీ ఈ విషయం ఎందుకు చెప్పలేదురా... ఆ కుక్కని చంపించేవాణ్ణి" అన్నాడు ఊగిపోతూ.

"ఆగండి... వాడు కుక్కతో కొడితే మనం పిల్లితో కొడదాం...' అన్నాడు సాలోచనగా సుందరయ్య.

రాజారాంకి అర్థంకాలేదు.

సుందరయ్య మౌనంగా ఉండటంతో... రెండువేల రూపాయలు తీసి చేతుల్లో పెట్టాడు.

వాటిని జేబుల్లో పెట్టుకుంటూ చిద్విలాసంగా నవ్వేడు సుందరయ్య.

"ఆవేశంలోకన్నా... ఆలోచనతో దెబ్బ కొట్టేవాడే నిజమైన పొలిటికల్ లీడరు. మీరు సర్పంచ్. మీపేరులోనే 'సర్పం' ఉంది. కాటేస్తే వాడికి నామినేషన్ డబ్బులు కూడా ఉండకూడదు" అని రాజారాం రెండు చెవుల్లోనూ పొలిటికలోపనిషత్తుని నూరిపోశాడు.

రాజారాం వివశుడై రెండు ఫుల్‌బాటిల్స్ ఓపెన్ చేశాడు.

*   *   *   *

చిన్నపాటి చిరుతపులిలా... దర్పంగా అడుగులో అడుగేసుకుంటూ తిరిగే సర్పంచ్‌గారి పిల్లి అంటే ఆ ఊరందరికీ పరిచయమే.

అది ఎవరి ఇంట్లో దూరి పాలు తాగినా... దాన్ని ఎవరూ ఏమీ అనకూడదు. అది దానికున్న ప్రాధమిక హక్కు...

దానికి అప్పుడప్పుడు నాన్‌వెజ్ తినాలన్పించి... ఎవరి కోడికి ఎసరుపెట్టినా కనీసం బొచ్చుముట్టడానిక్కూడా వీల్లేదు. అది ఎప్పుడు, ఎవరింట్లో దూరి మలమూత్రాలు విసర్జించినా... వాటిని గొబ్బెమ్మలంత అపురూపంగా తీసేయాలి తప్ప... ఎవరూ అసహ్యించుకోకూడదు. అది దానికున్న నైతికహక్కు...

అది 'మ్యావ్ మ్యావ్'మని భయంకరంగా అరిచినా... అందమైన గజల్ వింటున్నట్టు అనుభూతించాలి తప్ప... ఎవరూ చెవులు మూసుకోకూడదు. అది దానికున్న పౌరహక్కు. అది దానికున్న ప్రజాస్వామ్య హక్కు...

అలాంటి పిల్లి... ఓ అర్థరాత్రి...

రెండు వేల బ్రాయిలర్ కోళ్లున్న ఫామ్‌లోకి దభిల్లున్న దూకింది. ఆ శబ్దాన్ని ఎప్పుడూ వినని కోళ్లలో రెండొందల కోళ్ల గుండెలు రప్ రప్ మని ఆగిపోయాయి. దాని భయంకరమైన ఆకారాన్ని చూసిన నాలుగొందల కోళ్లు "కొక్కొక్కరొక్కో...' అని అరవబోతూ... అలాగే చచ్చూరుకున్నాయి.

ఆకాశంలో పాలమబ్బుల్లో తేలిపోతున్నట్లు పీలయిపోయిన సర్పంచ్‌గారి పిల్లి... ఆనందంగా 'మ్యావ్'మంది. అంతే! అసలే బ్రాయిలర్ కోళ్లు కాబట్టి పన్నెండొందల కోళ్లు ఒక్కసారి ఫట్‌మన్నాయి.

పిల్లిగారు విరుచుకొని... పంజా విసిరింది. నాలుకని బయటికి తీసి మీసాల్ని ఓసారి మెలేసింది. కొన్నింటిని చీల్చి చెండాడింది. ఇంకొన్నింటిని చూపుల్తోనే చంపింది.

గంటలోగా కోళ్ల ఫారమంతా... తుపానొచ్చిన ఒరిస్సాలా మారింది. తెల్లారేసరికి... ఊరంతా గుప్పుమంది.

"సర్పంచ్ గారి పిల్లి భూషణంగారి ఫారంలో రెండువేల కోళ్లని చంపేసిందట..." విషయం

తెల్సిన భూషణం వీరభద్రుడైపోయాడు. ఆ పిల్లిని చంపడానికి పదిమందిని కత్తులు, కర్రలిచ్చి పంపాడు.

వాళ్లు సాయంత్రానికల్లా చచ్చిన పిల్లిని తీసుకొచ్చి భూషణం కాళ్లముందు పడేశారు.

"మీలో ఒక్కడు తగ్గినట్టున్నాడు..." అన్నాడు అనుమానంగా భూషణం. వాళ్లు తొమ్మిదిమందే ఉండటంతో.

"పిల్లిని చంపి తీసికొస్తుంటే... రాజారాం మనుషులు వెంటపడ్డారు. మాలో శేషుగాడు సర్పంచ్ మనుషులకి దొరికిపోయాడు" చెప్పారు- ఒకరిద్దరు.

"హు..." అసహనంగా హూంకరించాడు భూషణం.

మర్నాడు తెల్లారేసరికల్లా... పొలాల్లో శేషుగాడి శవం కన్పించింది.

* * * *

"ఒరేయ్ పరంధాములు... ఉప్పేసి ఊరుకున్నాం... ఊరంటుకొందిరా" అన్నాడు సుందరయ్య పెగ్గుపోస్తూ.

"అసలు రాజకీయమంతా నాయకుల చేతుల్లో ఉండదురా నాయనా... వాళ్లుత్తి యాక్టర్స్, మనలాంటోళ్లం తెరవెనుక ఎంత కష్టపడతామో... జనాలకేం తెల్సు? వాళ్లు లీడర్లకు దండలేసి దండం పెట్టేటప్పుడు నాకు నవ్వొస్తుంటాది". గటా గటా గ్లాసు ఖాళీ చేసి నవ్వాడు పరంధాములు.

"సరేగాని... మన కష్టాల్ని దేవుడు కూడా చూస్తున్నాడు. పేపర్ చూశావా?" అడిగాడు సుందరయ్య.

"ఏమిట్రా?"

"స్థానిక సంస్థల ఎన్నికలకు తేదీల ఖరారు" తన్మయంగా చెప్పాడు సుందరయ్య.

"మరో నెల్రోజులు సుష్ఠుగా విందు, మందుతోపాటు చెరో పదివేలన్నా దొరుకుతాయ్. ఏంట్రా... సోడా అయిపోయిందా? మొహం దీనంగా పెట్టావ్?" అడిగాడు పరంధాములు.

"ఏంలేదు. సర్పంచ్ ఎలక్షన్‌లయ్యాక... మళ్లీ ఎన్నికలు ఎప్పుడొత్తాయో... ఏంటో..." అన్నాడు నిట్టూరుస్తూ సుందరయ్య.

"ఇలాగే మరో రెండు ఎలక్షన్లు ఏవన్నా వస్తే బ్యాలెట్ బాక్స్‌లా స్ట్రాంగయిపోతాం. అంతా ఎలక్షన్ కమిషన్ దయ..." గ్లాసు ఖాళీచేస్తూ చెప్పాడు పరంధాములు.

'జై ఓటు మాతల్లి' అని తేన్చి, అక్కణ్ణించి వాళ్లిద్దరూ విడిపోయారు...

ప్రజాస్వామ్యం సాక్షిగా!!!

అదే సమయానికి... శేషుగాన్ని చంపారన్న పగతో భూషణం మనుషులు రాజారాం సోదరున్ని వేటాడుతున్నారు.

కథా నిలయం
3962